క్లుప్తంగా


మరకత లింగానికి ప్రత్యేక పూజలు



పుష్పఅలంకరణలో మరకతమణి లింగం

పాలకొండ రూరల్: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక నక్కలపేట షిర్డీసాయి మందిరంలో కొలువుతీరిన మరకతమణి శివలింగానికి సోమవారం విశేష పూజలు, అర్చనలు చేశారు. అర్చకులు పర్రి శరత్‌కుమార్ భక్తులు సమర్పించిన పుష్పాలు, ప్రసాదాన్ని స్వామికి నివేదించారు. స్వామివారిని పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు.

రేపటి నుంచి మొండెంఖల్‌లో జాతర



ఉత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామంలో ఈ నెల 22 నుంచి 24 వరకు వైభవ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. మూడు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అలాగే ప్రతిరోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బోరు మరమత్తులు చేస్తున్న సిబ్బంది

భామిని: మండలంలోని బిల్లుమడ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న తాగునీటి బోరును ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సోమవారం బాగు చేశారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామస్తుల తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ సిగడాన రాధాకృష్ణ తెలిపారు. అందులో భాగంగా బోరు బాగుచేయించామన్నారు.

రైతుల ఆందోళన



రైతుల ఆందోళనకు మద్దతు తెలుపుతున్న పడాల భూదేవి


భామిని: మండలంలోని పెద్దదిమిలి వద్ద సోమవారం రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి నుంచి స్పందన లేకపోవడంతో ధాన్యం బస్తాల ట్రాక్టర్లతో ఏబీ రోడ్డును నిర్బంధించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. రైతుల ఆందోళనకు నారీశక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవి మద్దతు తెలిపారు. బత్తిలి ఎస్సై వై.అమ్మన్‌రావు సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని వారిని సముదాయించారు. ధాన్యం కొనుగోలుపై అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన విరమించమని భీష్మించుకుని కూర్చున్నారు. సమస్యను ఎస్సై అమ్మన్‌రావు తహసీల్దార్ నీలాపు అప్పారావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన జిల్లా డీసీఎంఎస్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. డీటీ శేఖరం, ఆర్ఐ రాంబాబు, ఏవో రైతుల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలుకు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

రైతులకు అండగా నిలవాలి

పాలకొండ రూరల్: అధికార యంత్రాంగం రైతులకు అండగా నిలవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. మండలంలోని తంపటాపల్లి గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యం అమ్మకంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని జిల్లా కలెక్టర్ ఆదేశించినా మిల్లర్ల తీరులో మార్పు రాలేదన్నారు. అపరాలకు గిట్టుబాటు ధర లేకుండా దళారులు అవస్థలకు గురిచేస్తున్నట్లు రైతులు వాపోయారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని రైతు సంఘం నాయకులు తెలిపారు. ఆయనతో పాటు కె.రామూర్తినాయుడు, బీవీ రమణ, సురేష్‌కుమార్ తదితరులున్నారు.

విస్తరిస్తున్న వీరఘట్టం

- పెరిగిన జనాభా
- మేజరు పంచాయతీగా గుర్తింపు
- నగరపంచాయతీగా చేస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశం



వీరఘట్టం పట్టణం

వీరఘట్టం: జిల్లాల పునర్విభజనలో భాగంగా వీరఘట్టం మేజరు పంచాయతీ కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో చేరింది. డివిజన్ కేంద్రం పాలకొండకు, జిల్లా కేంద్రం పార్వతీపురానికి మధ్యన ఉన్న వీరఘట్టం భవిష్యత్‌తో నగర పంచాయతీగా మారేందుకు అన్ని అర్హతలు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపితే వీరఘట్టం పట్టణం అనతికాలంలోనే నగర పంచాయతీగా అవతరించే అవకాశం లేకపోలేదు.

ఇదీ పరిస్థితి..

ప్రపంచ మల్లమార్తాండ, కలియుగ భీముడు కోడి రామ్మూర్తినాయుడు జన్మించిన గడ్డ వీరఘట్టం. బ్రిటిష్ కాలంలో 4 వేల జనాభా ఉండేది. 1918లో వీరఘట్టం గ్రామ పంచాయతీగా ఆవిర్భవించింది. అనంతరం జనాభా పెరగడంతో 1971లో మేజరు పంచాయతీగా ఏర్పడింది. నేడు పట్టణ జనాభా 20 వేలకు పైనే ఉంది. నగర పంచాయతీగా గుర్తించేందుకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్నాయి.

పరిసర గ్రామాలను విలీనం చేస్తే..

మేజరు పంచాయతీ నగర పంచాయతీగా మారాలంటే కనీసం 30 వేల జనాభా ఉండాలి. ప్రస్తుతం వీరఘట్టం పట్టణ జనాభా 20వేలకు పైగానే ఉంది. పరిసరాల్లోని 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్న నడుకూరు, బూరుగ, ఎం.రాజపురం, విక్రమపురం, యు.వెంకమ్మపేట, రేగులపాడు, కంబరవలస గ్రామాలను మేజరు పంచాయతీలో విలీనం చేసి నగర పంచాయతీగా ఏర్పాటు చేస్తే పట్టణం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది.



వీరఘట్టం మేజరుపంచాయతీ కార్యాలయం

భవిష్యత్‌లో అవకాశం ఉంది



వీరఘట్టం మేజరు పంచాయతీ భవిష్యత్‌లో నగర పంచాయతీగా మారే అవకాశాలు ఉన్నాయి. వీరఘట్టం సమీపంలో ఉన్న గ్రామాలు మేజరుపంచాయతీలో విలీనం అయితే నగర పంచాయతీగా రూపాంతరం చెందే అవకాశం ఉంది.

– ఎ.ప్రభాకరరావు, ఎంపీడీఓ, వీరఘట్టం

శిఖబడి సచివాలయ సందర్శన



శిఖబడి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్.రమేష్ సోమవారం సందర్శించారు. ఉద్యోగులు హాజరు, పనితీరు, అందిస్తున్న ఈ-సర్వీసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఈ-సర్వీసులకు సంబంధించిన నగదు రూ.11535లు ప్రభుత్వ ఖాతాలో జమ చేయకపోవడంతో వెంటనే చెల్లించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పిల్లల హాజరును పరిశీలించారు. ఆరుగురు పిల్లలకు 4గురు మాత్రమే హాజరు కావడంతో మిగిలిన వారు ఎక్కడ అని ప్రశ్నించారు. గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కింద అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేస్తున్నదీ లేనిదీ తనిఖీ చేశారు.

అమల్లో ఎన్నికల నియమావళి

గుమ్మలక్ష్మీపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనందున గుమ్మలక్ష్మీపురం మండలంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని తహసీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించకూడదన్నారు. అలాగే సంక్షేమ పథకాల హామీలు, పంపిణీ చేపట్టరాదన్నారు. మండలంలో మొత్తం 603 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, వారిలో పురుష ఓటర్లు 373 మంది, మహిళా ఓటర్లు 230 మంది ఉన్నట్లు చెప్పారు.

ఎమ్మెల్యే పరామర్శ



నానిబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు

పాలకొండ: మండలంలోని పెదమంగళాపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ కరణం నానిబాబును రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం పరామర్శించారు. నానిబాబు తల్లి పార్వతమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న జోగులు పెదమంగళాపురంలోని నానిబాబు ఇంటికి వెళ్లి పరామర్శించారు. పార్వతమ్మ మృతికి సంతాపం తెలియజేశారు. ఆయనతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



సీతామాంబపురంలో మస్తర్లను పరిశీలిస్తున్న ఏపీఓ బాలకష్ణ

కొమరాడ: మండలంలోని 31 పంచాయతీల్లో ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనికల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఓ వి.బాలకృష్ణ అన్నారు. ఆర్తాం పంచాయతీ సీతామాంబపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పనులకు హాజరైన వేతనదారుల సంఖ్య, మస్తర్లను పరిశీలించారు. మండలంలో ప్రతిరోజు ఐదు వేల మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారన్నారు. పని కావాల్సిన వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే పని కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



వృద్ధురాలికి నిత్యావసర సరుకులు అందిస్తున్న సేవాసమితి సభ్యులు

పాలకొండ రూరల్: భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి నేతృత్వంలో సోమవారం పలువురు పేదలకు అమృత కళశాలను అందజేశారు. సమితి సభ్యులు గుర్తించిన పేదల ఇళ్లకు వెళ్లి 20 కిలోల బియ్యం, వంట సామాగ్రి, నిత్యావసర సరుకులతో కూడిన బ్యాగ్‌లను అందించారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ ఆర్.కిశోర్ మాట్లాడుతూ.. పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని కోరారు.

నేడు జాబ్‌మేళా

పాలకొండ రూరల్: నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలు కల్పించే క్రమంలో స్థానిక తమ్మినాయుడు విద్యా సంస్థల నేతృత్వంలో ఈ నెల 21న ప్రత్యేక ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.తిరుపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ కనెక్ట్ డ్రైవ్‌లో భాగంగా హెటిరో డ్రగ్ పార్మసీ కంపెనీలో ఉద్యోగ అవకాశాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీఏ, బీకామ్, బీఎస్సీ పూర్తి చేసిన 18 నుంచి 25 ఏళ్లగల యువకులు మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9182398325 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దళారీల దోపిడీని అరికట్టాలి



ధర్నా చేస్తున్న గిరిజనులు

సీతంపేట: గిరిజనోత్పత్తులకు సరైన మద్దతు ధరలు ప్రకటించి దళారీల దోపిడీని అరికట్టాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. గిరిజన సంఘం నాయకులు జీసీసీ వరకు ర్యాలీ చేశారు. సంఘం కార్యదర్శి ఎ.గంగాధర్ మాట్లాడుతూ గిరిజనుల ఉత్పత్తుల కొనుగోలు, మద్దతు ధర చెల్లింపులో జీసీసీ పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. దీంతో దళారీలు తూకాల్లో మోసాలు చేస్తున్నారని, తక్కువ ధరలకే ఉత్పత్తులు కొనుగోలు చేసి గిరిజనుల కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ దాసరి కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జె.శ్రీరాములు, పి.సాంబయ్య, భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు ఏఈ బి.శంకరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో వార్షిక నిర్వహణ, చెట్టు కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

స్పందన వినతులకు సత్వర పరిష్కారం

పాలకొండ: స్పందనలో అందిన వినతులను సత్వరం పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం ఐదు వినతులు అందాయని, వాటిని పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను ఆదేశించినట్లు చెప్పారు. అర్జీల స్వీకరణ, సమస్య పరిష్కారంపై ఫిర్యాదుదారులకు లిఖితపూర్వక సమాధానం చేరవేయడం జరుగుతుందన్నారు.

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలి



రైతుల సమస్యను సబ్‌కలెక్టర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను కలిసి రైతుల సమస్యలను వివరించారు. అపరాల పంటలు ఉన్నందున ఇంతవరకు రైతులు నూర్పులు చేయలేదని, ప్రస్తుతం పంట నూర్పులు చేపడుతున్నందున ప్రభుత్వం ధాన్యం సేకరణ చేపట్టాలని కోరారు. బాసూరు, వాటపాగు గ్రామా ల్లో అధికారుల లెక్కల్లో కూడా ఈ-పంట నమో దు కాలేదని తెలిపారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ ఆర్‌బీకేల వారిగా ధాన్యం కొనుగోలుకు లక్ష్యాలను నిర్దేశిస్తామన్నారు. రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం సేకరణ చేస్తామని తెలిపారు. మండంలో ఏనుగుల సమస్యను విక్రాంత్ సబ్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

సారా కేసులు నమోదు

పాలకొండ రూరల్: మండలంలోని అవలంగి, స్కాట్‌దొరవలస సమీపంలో సోమవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇద్దరు మహిళల వద్ద 20 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బి.శివప్రసాద్ చెప్పారు.

వీరఘట్టం: నడుకూరు సమీపంలో సారా ప్యాకెట్లతో వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 110 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కృష్ణంనాయుడు తెలిపారు.

బోదవ్యాధి నివారణ మందులు పంపిణీ చేయాలి

పార్వతీపురంటౌన్: బోదవ్యాధి నివారణ మందులు పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని జోనల్ అధికారి డాక్టర్ మధుసూదన ప్రసాద్ అన్నారు. బోదవ్యాధి నివారణ మందుల పంపిణీ కార్యక్రమంపై సోమవారం స్థానిక జిల్లా మలేరియా కార్యాలయంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులకు ఎండీఏ కార్యక్రమం సక్రమంగా జరిగేలా దిశానిర్దేశం చేశారు. ఎండీఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

గొప్పమనసు చాటుకున్న గురువులు



చిన్నారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

భామిని: బోన్‌మ్యారో వ్యాధితో బాధపడుతున్న చిన్నారి చికిత్సకు పలువురు ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. పాతపట్నం మండలం కొరసవాడకు చెందిన సిరిపురం ప్రసాదరావు కుమారుడు సిరిపురం మోక్షజ్ఞ(3) బోన్‌మేరో వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని సిటిజన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధిత బాలుడి వైద్య ఖర్చులకు భామిని మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రూ.50 వేలు సేకరించి సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

గిరిజన స్పందనకు 18 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఏపీఓ రోసిరెడ్డి

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 18 వినతులు వచ్చాయి. ఏపీఓ రోసిరెడ్డి వినతులు స్వీకరించారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలని డెప్పిగూడకు చెందిన వెంకమ్మ కోరారు. సీసీరోడ్డు మంజూరు చేయాలని పెదరామకు చెందిన గణపతిరావు, పాసింజర్ ఆటో కొనుగోలుకు రుణం ఇప్పించాలని పాలిష్‌కోట గ్రామస్తుడు సతీష్ వినతి ఇచ్చారు. కంప్యూటర్ కాటా మంజూరు చేయాలని మామిడిజోల గ్రామస్తుడు నారాయణ, రంగవలసకు చెందిన పెంటయ్య ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కొండాడ గ్రామస్తులు తమ గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని, ఎగువజాడు పల్లెకు చెందిన ఆదెమ్మ అగ్నిప్రమాదంలో నష్టపోయిన జీడీ, మామిడి తోటలకు పరిహారం ఇప్పించాలని విన్నవించారు. దోనుబాయి ఎంపీటీసీ కోటేశ్వరరావు వాటర్‌ట్యాంకు ఏర్పాటు చేయాలని, ధాన్యం కొనుగోలు చేయాలని ఈతమానుగూడకు చెందిన ప్రియాంక కోరారు. స్పందనలో ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ ఎం.యుగంధర్, ఏఎంఓ కోటిబాబు, గురుకులం సెల్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్తులకు అండగా సీఎం సహాయ నిధి



చంద్రరావు తండ్రి సంజీవరావుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: సీఎం సహాయనిధి ఆర్తులకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. క్యాన్సర్‌వ్యాధితో మృతి చెందిన భామిని మండలం బాలేరుకు చెందిన చంద్రరావు కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల పరిహారం చెక్కును సోమవారం ఆమె అందజేశారు. ఈ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భామిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తకోట ఆంజనేయులు, చంద్రశేఖర్, చలపతిరావు, ఆర్.రామారావు, చిరంజీవులు, చిన్నయ్యదొర ఉన్నారు.

ఏనుగులను కవ్వించొద్దు



చెరుకు తోటలో ఉన్న ఏనుగులు

వీరఘట్టం: ఏనుగుల సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎం.హరికృష్ణ సూచించారు. కిమ్మి, నడుకూరు, చిట్టపులివలస పరిసర ప్రాంతాల్లోని పంటపొలాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోందని, అవి కంటపడితే కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని కోరారు. సోమవారం చిట్టపులివలస సమీపంలోని చెరుకు తోటలో ఏనుగుల గుంపు ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడకు చేరుకుని స్థానికులను అప్రమత్తం చేశారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

గరుగుబిల్లి: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని జట్టు ట్రస్టీ డి.పారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలతో నవధాన్య సాగుపై శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు 10 కేజీల చొప్పున 18 నుంచి 30 రకాల విత్తనాలను తొలకరి వర్షాలకు ముందు పొలంలో వేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల భూసారం పెరగడంతోపాటు భూమి పొరల్లో సేంద్రియ, కర్బన శాతం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

ప్రత్యేక బస్సుల ద్వారా రూ. 7.58 లక్షల ఆదాయం

- జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్

పార్వతీపురం టౌన్: శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వేర్వేరు ప్రాంతాలకు 52 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక డీపీటీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18 , 19 తేదీల్లో పార్వతీపురం, సాలూరు, పాలకొండ డిపోల నుంచి 52 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక బస్సుల ద్వారా పార్వతీపురం డిపో నుంచి 7 బస్సులకు గాను రూ.63,583, సాలూరు డిపా నుంచి 25 బస్సులకు గాను రూ 3,43,196, పాలకొండ డిపో నుంచి 20 బస్సులకు గాను రూ. 3,52,040ల ఆదాయం సమకూరినట్లు వివరించారు.

అన్నసమారాధన



జియ్యమ్మవలస శివాలయంలో అన్నసమారాధన

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం అన్నసమారాధన చేశారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం నుంచి మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అన్నసమారాధనకు గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ గోపాలరావు

గరుగుబిల్లి: మండలంలోని కొత్తపల్లిలో పారిశుద్ధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సర్పంచ్ గొట్టాపు శ్రీవేణి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలోని కాలువల్లో పూడికలు తొలగించి, క్లోరినేషన్ చేస్తున్నారు. ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు సోమవారం పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్



జీసీఎంఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నేతలు

గుమ్మలక్ష్మీపురం: గిరిజనులు సేకరిస్తున్న చింతపండు, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు చెల్లించాలని ఏపీ గిరిజన సంఘం నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ డిమాండ్ చేశారు. గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ కార్యాలయం ఎదుట సోమవారం సంఘం నాయకులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజనులకు ఆర్థికంగా దన్నుగా నిలిచే అటవీ ఉత్పత్తులైన చింతపండును కిలో రూ.50లు చొప్పున, కొండచీపుర్లను ఒక్కొక్కటి రూ.80, జీడిపిక్కలు కిలో రూ.200లు చొప్పున ధర చెల్లించి జీసీసీ అధికారులు సేకరించాలని కోరారు. జీసీసీ అభివృద్ధికి ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం జీసీసీ మేనేజర్ కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.